ఏ వాదం? ఏ నినాదం?

- పనిచేయని బీసీ సీఎం, ఎస్సీ వర్గీకరణ నినాదాలు
- లోక్‌సభ ఎన్నికలపై రాష్ట్ర బీజేపీ నేతల మల్లగుల్లాలు
- మళ్లీ మోదీ మంత్రమే తప్ప ప్రత్యామ్నాయం కరువు

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో ఏ నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలో తెలియక రాష్ట్ర బీజేపీ నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రధాని నరేంద్రమోదీ నామాన్ని జపించడమే తప్ప మరే ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ మోదీ నామస్మరణకే పరిమితమైంది. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే డబుల్ ఇంజిన్ సర్కారుతో రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతుందని చెప్పుకొచ్చింది. అదే సమయంలో బీసీ, ఎస్సీలను ఆకట్టుకునేందుకు పెద్దఎత్తుగడ వేసింది. తెలంగాణలో తాము అధికారంలోకి వస్తే బీసీ వర్గీయుడిని ముఖ్యమంత్రిని చేస్తామని స్వయంగా మోదీతో చెప్పించింది. ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణమాదిగ నిర్వహించిన సభకు మోదీని రప్పించి, ఎస్సీల వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని మరో ప్రకటన చేయించింది. తద్వారా బీసీలు, ఎస్సీలు ఏకపక్షంగా తమకు ఓట్లు వేస్తారని, దీంతో తాము అధికారంలోకి వస్తామని బీజేపీ కలలుగన్నది. కానీ, ఆ నినాదాలతో బీజేపీ ఓట్ల శాతం పెరగడం తప్ప ఆ పార్టీకి పెద్దగా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆ రెండు నినాదాలు లోక్‌సభ ఎన్నికల్లో ఏమాత్రం పనిచేయవని బీజేపీకి తెలిసొచ్చింది. అయినా ప్రస్తుతానికి మోదీ మంత్రం తప్ప కమలనాథులకు వేరే ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. కొత్తగా ఏ నినాదాన్ని ఎత్తుకోవాలో, ఓటర్లను ఆకట్టుకునేందుకు ఏ వాదాన్ని వినిపించాలో వారికి అర్థం కావడం లేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల కంటే బీఆర్ఎస్‌పై రొడ్డకొట్టుడు విమర్శలు చేసేందుకే అధిక ప్రాధాన్యమిస్తున్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు హామీలను నెరవేర్చకపోయినా,కాంగ్రెస్‌పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నా బీజేపీ నేతలు పెద్దగా స్పందించడం లేదు. ఇప్పటికైనా స్పష్టమైన కార్యాచరణను లేకుంటే ప్రజలు బీజేపీని నమ్మరని ఆ పార్టీ శ్రేణులే చెప్పుకుంటున్నాయి.

కాంగ్రెస్ మోసకారి

మాటమార్చడం రేవంత్‌రెడ్డికి కొత్త కాదు

- 'పార్టీ మారితే వేటు' హామీని తెలంగాణ నుంచే అమలుచేయాలి
- నాడు కడియం దళితుడే కాదని.. ఇప్పుడు టికెట్ ఎలా ఇచ్చారు?
- 'మీట్ ది ప్రెస్'లో బీజేపీ నేత ఈటల రాజేందర్

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి రావాలనే ఏకైక లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు గుప్పించిందని బీజేపీ నేత ఈటల రాజేందర్ మండిపడ్డారు. తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రం అప్పుల ఊబిలో ఉందని ప్రచారం చేస్తూనే, అలవికాని హామీలు ఇచ్చారని విమర్శించారు. మాట మార్చడం సీఎం రేవంత్‌రెడ్డికి కొత్తేమీ కాదని ఎద్దేవా చేశారు. ఆయన ఇటీవల ప్రధాని మోదీ తమ పెద్దన్న అని చెప్పారని, ఇప్పుడు మాట మార్చి మోదీకి ఎందుకు ఓటెయ్యాలె అని ప్రశ్నిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో చాలాకాలం తర్వాత ప్రజలు నీళ్ల కోసం పరితపించే పరిస్థితి వచ్చిందని, ఇందుకు ఎవరు కారణమని నిలదీశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పొన్నాల లక్ష్మయ్య బీఆర్ఎస్‌లో చేరితే.. నాడు అడ్డుగోలుగా మాట్లాడిన రేవంత్‌రెడ్డి..ఇప్పుడు కేశవరావును, కడియం శ్రీహరిని ఎందుకు చేర్చుకున్నారని ప్రశ్నించారు. గతంలో కడియం శ్రీహరి దళితుడే కాదని విమర్శించిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఆయన కూతురుకు టికెట్ ఎలా ఇచ్చారని నిలదీశారు. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఎలా టికెట్ ఇస్తారని ప్రశ్నించారు. పార్టీ మారినవారు పదవికి రాజీనామా చేయకపోతే అనర్హత వేటు పడేలా చట్టం చేస్తామంటున్న రాహుల్ గాంధీ.. ముందు తెలంగాణలో అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ నేతలు ఇతర పార్టీల వారిని కొంటున్నారని, బిల్లులు మంజూరు చేయాలంటే తమ పార్టీలో చేరాలని కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు.

'కొమురవెల్లి' టెండర్లలో గోల్‌మాల్!

- మార్కెట్ కంటే రెట్టింపు ధరలు
- నాణ్యమైన వస్తువులకు కోట్..
- నాసిరకం నిత్యావసరాలు సరఫరా
- హైదరాబాద్ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం
- చోద్యం చూస్తున్న అధికారులు

కొమురవెల్లి మల్లికార్జున స్వామి

నిత్యావసర సరుకులు భద్రపరిచే సెంట్రల్ స్టోర్

చేర్యాల, ఏప్రిల్ 7: కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానానికి నిత్యావసర వస్తువుల సరఫరాలో కాంట్రాక్టర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆలయ నిబంధనల ప్రకారం టెండర్లలో కోట్ చేసిన విధంగా సరుకులు పంపిణీ చేయకుండా ఏటా రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు స్వామివారికి శఠగోపం పెడుతున్నారు. నాణ్యమైన వస్తువులు సరఫరా చేస్తామని టెండర్లు దక్కించుకుని.. నాసిరకం వస్తువులు పంపిణీ చేస్తున్నారు. అంతేకాదు.. నాసిరకం వస్తువులకు కూడా మార్కెట్ ధరల కంటే రెట్టింపు రేట్లు వసూలు చేస్తూ దేవస్థానం సొమ్మును లూటీ చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ బడా కాంట్రాక్టర్.. దేవదాయ శాఖ ఉన్నతాధికారులతో కుమ్మక్కై.. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలన్నింటినీ తన గుప్పిట పట్టుకుని ఇలా మోసానికి పాల్పడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాసిరకం సరుకుల సరఫరాను అరికట్టాల్సిన దేవాదాయశాఖ విజిలెన్స్, ఇతర శాఖలు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయని విమర్శలొస్తున్నాయి. కొమురవెల్లి ఆలయానికి పంపిణీ చేసే వస్తువుల హక్కుల టెండర్లను ఆ బడా వ్యాపారికి చెందిన మూడు సంస్థలు 20 ఏండ్లుగా దక్కించుకుంటున్నాయి. తాజాగా 2024-25 సంవత్సరానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఇక దేవాదాయశాఖ కమిషనర్ టెండరు ఖరారు చేస్తే.. మునుపటిలాగే టెండరుదారుడు మార్కెట్ కంటే రెట్టింపు ధరలకు నిత్యావసర సరుకులు సరఫరా చేసే అవకాశం ఉందని, సంబంధిత శాఖ అధికారులు మార్కెట్ ధరల మేరకు సరుకులు సరఫరా చేసే వారికి టెండరు అప్పగించాలని భక్తులు కోరుతున్నారు.

ఆలయానికి నిత్యావసరాలు ఎందుకు?

స్వామివారి బ్రహ్మోత్సవాలతోపాటు మిగిలిన రోజుల్లో లడ్డూ, పులిహోర, నిత్యాన్నదానం, స్వామివారికి నిత్యనివేదన, వీఐపీలు, భక్తులకు అన్నదానం తదితర వాటి కోసం ఏటా ఆలయానికి నిత్యావసర వస్తువులు అవసరం అవుతాయి. ఆలయ అధికారులు వస్తువులను నేరుగా కొనుగోలు చేయకుండా, సరుకులు కొనేందుకు ఆన్‌లైన్‌లో టెండర్లను పిలుస్తారు. తక్కువ ధరలకు సరుకులను పంపిణీ చేస్తామని పలు వ్యాపార సంస్థలు, ట్రేడర్స్ వారు ధరలను కోట్ చేసి ఆన్‌లైన్‌లో టెండర్ దాఖలు చేస్తారు. పంపిణీదారులు 'ఏపీసీ మరియు హెచ్ఆర్ఐ ఎండోమెంట్స్ ఆక్ట్ 30/87' ప్రకారం.. నిబంధనలకు లోబడి సరుకులు పంపిణీ చేయాలి. ఆలయ అధికారులు ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన టెండర్లను తెరిచి అందులో తక్కువ ధరలకు, ఆలయం పార్మాట్‌లో ఎవరైతే సరుకులు సరఫరా చేసేందుకు ముందుకు వస్తారో.. వారికే ఏడాదిపాటు టెండరు హక్కులను అప్పగిస్తారు. కొమురవెల్లికి సిద్దిపేట, గజ్వేల్, చేర్యాల తదితర పట్టణ కేంద్రాలు దగ్గరగా ఉన్నప్పటికీ.. హైదరాబాద్ నగరానికి చెందిన ఓ సంస్థ యాజమాన్యం దేవాదాయశాఖలో కొందరు అధికారులతో కుమ్మక్కై.. టెండరు తమకు అనుకూలంగా వచ్చే విధంగా కఠినమైన నిబంధనలను తయారు చేయించి స్థానికులు టెండర్లలో పాల్గొనకుండా చేస్తున్నారు. దీంతో సమీపంలో ఉన్న వ్యాపారులు తక్కువ ధరకు నాణ్యమైన వస్తువులు సరఫరా చేసేందుకు ముందుకొచ్చినప్పటికీ.. కఠినమైన నిబంధనలు వారిని ఆన్‌లైన్ టెండర్‌లో పాల్గొనకుండా చేస్తున్నాయి. అయితే.. ఆన్‌లైన్‌లో హక్కులు పొందిన సంస్థ లేదా ట్రేడర్స్ వారు ఆలయవర్గాలు తెలిపిన తేదీ నుంచి సంవత్సరంపాటు పార్మాట్ ప్రకారం ఐఎస్ఐ, బ్రాండెడ్ వస్తువులను సరఫరా చేయాలి. సంస్థ నుంచి ఆలయానికి సరఫరా చేసిన సరుకులను అధికారులు లేదా సెక్షన్ ఇన్‌చార్జి వాటిని పరిశీలించి సెంట్రల్ స్టోర్‌లో భద్రపరిచి రికార్డులో నమోదు చేసిన అనంతరం పంపిణీ దారులకు ఆలయం నుంచి బిల్లులు చెల్లిస్తారు. సంవత్సరం పాటు సరఫరా చేసే వస్తువులలో కేవలం బ్రహ్మోత్సవాల కాలంలోనే మూడో వంతు వినియోగిస్తారు. ఇదేఅదనుగా భావించి పంపిణీ దారులు నాసిరకం వస్తువులను సరఫరా చేస్తూ అక్రమంగా సంపాదిస్తున్నారు.

ఆలయ ఫార్మాట్ ఒకటి.. సరఫరా చేసేది మరోటి

ఆలయ అధికారులు ఆలయానికి నిత్యం కావాల్సిన సరుకులను పంపిణి చేసేందుకు ఓ పార్మాట్ తయారు చేసి, సదరు ప్రతిని పంపిణీ దారులకు అందిస్తారు. కానీ.. పార్మాట్ ప్రకారం సరుకులు పంపిణీ కావడం లేదు. ఆలయానికి దాదాపు 52 నిత్యావసర వస్తువులు, కవర్లు పంపిణీ చేయాలి. వాటిలో ముఖ్యంగా సోనామసూరి బియ్యం, మొదటి రకం పప్పులు, నెయ్యి, పంచదార, శెనగపిండి, స్వస్తిక్ కంపెనీ కారంపొడి, పసుపు, కాజు పలుకులు, పల్లి, ఇలాచి, లవంగాలు, గోల్డ్‌డ్రాప్ కంపెనీ డాల్డ, అన్నపూర్ణ కంపెనీకి చెందిన ఉప్పు ప్యాకెట్లు, నిర్మా కంపెనీకి చెందిన సర్ఫ్, రెడ్ లేబల్ కంపెనీకి చెందిన చాయ్‌పత్తా, కాఫీ పౌడర్, ఉప్మారవ్వ, అటుకులు, జాజికాయ, మిశ్రి తదితర వాటిని సరఫరా చేయాలని ఫార్మాట్‌లో పేర్కొన్నారు. పంపిణీ దారులు మాత్రం ఫార్మాట్‌ను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా నాసిరకం నిత్యావసర వస్తువులను సరఫరా చేస్తున్నారు. సోనామసూరి కంపెనీ బియ్యానికి బదులు స్ట్రీమ్డ్ రైస్‌ను, మొదటి రకం పప్పులకు బదులుగా నాసిరకం పప్పులు, ఇతర వస్తువులను అందజేస్తున్నారు.

మార్కెట్ ధరల కన్నా ఎక్కువ ధరకు కొనుగోలు

వస్తువు	ఆలయం కొనుగోలు చేస్తున్న ధర	మార్కెట్ ధర
1.వంట నూనె	లీటర్ రూ.220	రూ.108
2.కారం పొడి	కిలో రూ.385	రూ.260
3.నెంబర్‌వన్ కాజు పలుకులు	కిలో రూ.990	రూ.650
4.శెనగ పప్పు	కిలో రూ.90	రూ.75
5.ఇలాచి	కిలో రూ.5,320	రూ.2,600
6.నువ్వుల నూనె	కిలో రూ.290	రూ.160
7.తేనె	కిలో రూ.425	రూ.350

మార్కెట్ ధరలకే టెండరు ఖరారు

దేవాదాయశాఖ నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో టెండరు పొందిన వారే ఆలయానికి నిత్యావసర సరుకులు సనఫరా చేస్తున్నారు. ఈ సంవత్సరం టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. దేవాదాయశాఖ నుంచి అప్రూవల్ తీసుకోలేదు. మార్కెట్ ధరలు ఏ విధంగా ఉన్నాయో సమీపంలో ఉన్న రత్నదీప్, రిలయన్స్ స్టోర్‌లను సంప్రదించి తెలుసుకుంటాం. అనంతరం టెండర్లపై నిర్ణయం తీసుకుంటాం. – ఏ బాలాజీ, ఆలయ ఈవో

సూర్యగ్రహణ అధ్యయనానికి నాసా జెట్‌లు

న్యూయార్క్, ఏప్రిల్ 7: సూర్యగ్రహణాన్ని మరింత అధ్యయనం చేయడానికి నాసా జెట్ ప్లేన్‌లను ఉపయోగించబోతున్నది. సోమవారం సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడనుంది. ఉత్తర అమెరికాలో గ్రహణం కనిపించనుంది. ఈ నేపథ్యంలో సూర్యుడికి సంబంధించిన అనేక రహస్యాలను చేధించేందుకు సూర్యగ్రహణాన్ని ఉపయోగించుకోవాలని నాసా భావిస్తున్నది. ముఖ్యంగా సూర్యుడి బాహ్య వాతావరణం, భూమి అయనావరణపై సూర్యుడు చూపిస్తున్న ప్రభావాన్ని అర్థం చేసుకునేందుకు, సూర్యుడి కాంతి వల్ల కనిపించకుండా ఉన్న గ్రహశకలాలను గుర్తించేందుకు అధ్యయనం చేయనున్నది. ఇందుకుగానూ ప్రత్యేక పరికరాలు అమర్చిన రెండు డబ్ల్యూబీ-57 జెట్ ప్లేన్లను వినియోగించనుంది. ఈ జెట్ ప్లేన్లు గంటకు 740 కిలోమీటర్ల వేగంతో 50 వేల అడుగుల ఎత్తున ప్రయాణించగలవు. మేఘాల అడ్డంకి లేకుండా స్పష్టమైన ఫొటోలు తీసుకునేందుకు వీలుగా ఈ జెట్‌లను వినియోగిస్తున్నది.

హిందూ పెండ్లికి కన్యాదానం ముఖ్యం కాదు: హైకోర్టు

లక్నో: హిందూ వివాహ చట్టం ప్రకారం హిందువుల పెండ్లికి కన్యాదానం ముఖ్యం కాదని అలహాబాద్ హైకోర్టు లక్నో ధర్మాసనం చెప్పింది. ఈ చట్టంలోని సెక్షన్ 7 కేవలం సప్తపదిని మాత్రమే ముఖ్యమైన కార్యక్రమంగా గుర్తించినట్లు తెలిపింది. ట్రయల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ అశుతోష్ యాదవ్ అనే వ్యక్తి దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌ను కోర్టు ఈ మేరకు తోసిపుచ్చింది.

ప్లాస్టిక్ రిజర్వాయర్లుగా సముద్రాలు

కాన్‌బెర్రా, ఏప్రిల్ 7: సముద్రాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎంతమేరకు ఉన్నాయన్న విషయాన్ని నిపుణులు తొలిసారి అంచనా వేశారు. ప్లాస్టిక్ రిజర్వాయర్‌గా సముద్రాలు మారాయని, 30 లక్షల టన్నుల నుంచి 1.1 కోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రం లోపల పేరుకుపోయాయని ఆస్ట్రేలియా జాతీయ సైన్స్ ఏజెన్సీ, యూనివర్సిటీ ఆఫ్ టొరొంటో పరిశోధకుల తాజా అధ్యయనం లెక్కతేల్చింది. ప్రతి నిమిషం ఓ ట్రక్ సైజ్‌లో ప్లాస్టిక్ సముద్రంలో కలుస్తున్నదని వీరి నివేదిక అంచనావేసింది. సీనియర్ పరిశోధకుడు డెనిస్ హార్డ్‌స్టీ మాట్లాడుతూ, 'ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రం లోపల ఎంతుందన్నది తెలిపిన తొలి పరిశోధన ఇది. ప్లాస్టిక్ వ్యర్థాలకు సముద్రాలు రిజర్వాయర్‌గా మారాయి. మైక్రో ప్లాస్టిక్ కాకుండా సంచులు, వలలు, కప్పులు.. మొదలైనవి ఎంతమేరకు ఉన్నాయన్నది తెలుసుకున్నాం' అని చెప్పారు.

పైసలు ఏమైనయ్?

మొదటిపేజీ తరువాయి...

ముక్కుపిండి వసూలు చేస్తుండటంతో రాష్ట్ర ఖజానాకు రాబడి పెరిగినట్టు చెప్తున్నారు. గతంలో ప్రతి నెల రాష్ట్ర ఆదాయం సుమారు రూ.10వేల కోట్ల వరకు వచ్చేదని అధికారులు చెప్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కఠిన విధానాల ఫలితంగా డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో సగటున 12 శాతం మేర ఆదాయం పెరిగినట్టు సమాచారం. మూడు నెలల్లోనే రాబడి రూ.34 వేల కోట్లు దాటిందని ఆర్థిక శాఖ వర్గాలు చెప్తున్నాయి. ఫిబ్రవరిలో రికార్డు స్థాయిలో ఏకంగా రూ.13వేల కోట్ల మార్కు దాటిందని అంటున్నారు. మార్చిలో కూడా ఇదే స్థాయిలో రాబడి ఉంటుందని చెప్తున్నారు.

శాఖల వారీగా లక్ష్యాలు..

ప్రజలపై పన్ను భారం మోపకుండా.. ఇతర మార్గాల ద్వారా ఆదాయాన్ని పెంచుకుంటామని, రాబడులను క్రమబద్ధీకరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి గతంలో చెప్పారు. శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని వసూలుపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, ట్రాన్స్‌పోర్ట్, మైన్స్ అండ్ మినరల్స్ తదితర శాఖలకు లక్ష్యాలను నిర్దేశించారు. జీఎస్టీ పన్ను పరిధిలో ఉన్నవారిపై తనిఖీలకు మొబైల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్లను పెంచడమే కాకుండా విజిలెన్స్ నిఘా, ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను మరింత కట్టుదిట్టం చేసింది. జీఎస్టీ అవకతవకలపై దాడులను ఉధృతం చేశారు. గతంలో కేటాయించిన అనేక మైనింగ్ లీజులను ప్రభుత్వం రద్దు చేసింది. అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. చిన్నా చితకా లోపాలను కూడా వదలకుండా ఇసుక లారీలకు భారీగా జరిమానాలు విధిస్తున్నారు. వీటిని వెంటనే చెల్లించకపోతే మైనింగ్‌కు అనుమతులు పునరుద్ధరించేదిలేదని స్పష్టం చేస్తున్నారు. ఇసుక రవాణా వాహనాలకు జీపీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఇలాంటి కఠిన చర్యల నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లో దళారులు బ్లాక్‌మార్కెట్‌లో ఇసుకను రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా దిగుమతి అవుతున్న నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్)పై కొరడా ఝుళిపిస్తున్నారు. ప్రతి డిస్టలరీ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు లిక్కర్‌ను డెలివరీ చేసే వాహనాలకు జీపీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. లిక్కర్ సరఫరా వాహనాల వేబిల్స్‌ను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఫలితంగా ఆదాయం గణనీయంగా పెరిగినట్టు ఆర్థిక శాఖ వర్గాలు చెప్తున్నాయి.

రోజుకు 6500 ట్యాంకర్ల బుకింగ్!

- మహానగరంలో తాగునీటి కటకట

మణికొండలో ఓ అపార్ట్‌మెంట్‌కు నీటిని సరఫరా చేస్తున్న వాటర్ ట్యాంకర్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరం మంచినీళ్ల కోసం అల్లాడుతున్నది. నగరంలో ఎక్కడ చూసినా నీటి కటకట కనిపిస్తున్నది. బిందెలతో పరుగులు... ట్యాంకర్ల వద్ద తోపులాటలు మళ్లీ షరామామూలయ్యాయి. బస్తీలు, శివారు ప్రాంతాల్లో ఈ క'న్నీటి' దుస్థితి అధికంగా ఉన్నది. గతంలో ఎన్నడూ లేని రీతిలో వెస్ట్ కారిడార్, శివారు ప్రాంతం తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నది. దీంతో ప్రస్తుతం నగరంలో రోజుకు 6500పైగా ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి.

కొత్త నీటి వనరులు లేకపోవడం, అదనపు నీటి జలాల తరలింపులు లేక జలమండలి అధికారులు రోజూ నగరానికి ఐదు నీటి వనరుల ద్వారా 559.81 ఎంజీడీలకు సరఫరా చేస్తున్నారు. కానీ విద్యుత్ సరఫరాలో అంతరాయం, భూగర్భజలాలు అడుగంటిపోవడం, నల్లాలకు మోటార్లు బిగించడం, లోప్రెషర్ సమస్య... అన్నింటి కంటే మించి తాగునీటికి గణనీయమైన డిమాండ్‌తో జలమండలి సరఫరా చేస్తున్న జలం ఏ మూలకూ సరిపోవడం లేదు. ప్రజలు పొదుపుగా నీటిని వాడుతున్నా అవసరాలు తీరడం లేదు. ఇటువంటి పరిస్థితులు వస్తాయని కలలో కూడా ఊహించలేదని మహిళలు చెబుతున్నారు. నీటి సరఫరా సమయం తగ్గించడమే కాకుండా లో ప్రెషర్‌తో నీటిని విడుదల చేయడం వల్ల ఈ సమస్య వస్తున్నదని చెప్తున్నారు. వచ్చే కొంచెం నీటిని బిందెలు, డ్రమ్ములలో నిల్వ ఉంచుకుని దినచర్యకు వాడుతున్నారు. ఇవి సరిపోకపోవడంతో చాలామంది ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. నగరంలో రోజుకు సరాసరిగా 6500లకు పైగా ట్యాంకర్లు బుకింగ్ అవుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా శేరిలింగంపల్లి అయ్యప్ప సొసైటీ, మణికొండ, పుప్పాలగూడ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాలలో ట్యాంకర్లకు డిమాండ్ ఉంటున్నది. రోజుకు 4 ట్యాంకర్ల (500లీటర్లు) చొప్పున నెలకు 120 కొనాల్సి వస్తుందని, ఈ భారాన్ని మోయలేకపోతున్నామని యాజమానులు లబోదిబోమంటున్నారు. ట్యాంకర్లకు డిమాండ్ పెరుగడంతో అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నీటి కష్టాలు తప్పించాలని కోరుతున్నారు.

ఒకటో తారీఖు జీతం ప్రచార ఆర్భాటమే

- సెర్ప్ ఉద్యోగులకు రెండు నెలలుగా అందని వేతనాలు

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకున్న ఒకటో తారీఖు వేతనం ప్రచార ఆర్భాటంగానే నిలిచింది. ఒకటో తారీఖు దేవుడెరుగు కనీసం నెల గడిచినా కూడా జీతం అందడంలేదని ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ చెప్పిన మాటలకు ఆచరణకు ఏ మాత్రం పొంతన లేదని, ఇది మాటల ప్రభుత్వంగా మారిందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు అందలేదు. రాష్ట్రంలో దాదాపుగా 4500 మంది సెర్ప్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరికి ఫిబ్రవరి, మార్చి నెల వేతనాలను ఏప్రిల్ మొదటి వారం వచ్చినా ఇంతవరకు ఇవ్వలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రతినెల వేతనాలు వచ్చేవని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లో ఇప్పటి వరకు రెండు నెలలు జీతాలు ఇంకా రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్కువ వేతనాలతో పనిచేసే తమకు నెలవారీ ఖర్చులకు డబ్బులకు లేక తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొవాల్సి వస్తుందని వారు చెబుతున్నారు. మహిళా సంఘాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం, వారికి అమలు చేసే కార్యక్రమాలు విజయవంతంగా చేయడంలో సెర్ప్ ఉద్యోగులది కీలక పాత్ర. అయినా కనీసం వేతనాలకు నోచుకోలేకపోతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినెల ఈఎంఐలు సకాలంలో చెల్లించకపోవడంతో సిబిల్ స్కోర్‌పై తీవ్ర ప్రభావం పడుతున్నదని, భవిష్యత్తులో పిల్లలకు, ఇంటి అవసరాలకు రుణాలు తీసుకోవడానికి ఇబ్బంది అవుతుందని వారు ఆందోళన వ్యక్తంచేశారు. ఉద్యోగులు, సంఘాల నాయకులు ఉన్నతాధికారులను ఎన్నిసార్లు అడిగినా కనీస స్పందన లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉన్నతాధికారులు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటున్నారని ఉద్యోగుల ఉసురుపోసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆర్థిక శాఖ అధికారుల వల్లనే జీతాలు ఆలస్యం అవుతున్నాయని సెర్ప్ అధికారులు, సెర్ప్ అధికారుల వల్లనే అని ఆర్థిక శాఖ అధికారులు కారణంగా చూపుతున్నారని సమాచారం. సెర్ప్ ఉద్యోగులందరికీ ఈ-కుబేర్ ద్వారా వేతనాలు చెల్లించాలని నిర్ణయించారని, అయితే ఈ ప్రక్రియ నాలుగైదు నెలలుగా సాగుతున్నదని, ఇంత వరకు పూర్తి కాలేదని దీంతో వేతనాలు సకాలంలో రావడంలేదని సమాచారం. తమ సమస్యను పరిష్కరించి వేతనాలు నెలనెలా అందేవిధంగా చూడాలని ఉద్యోగులు వేడుకుంటున్నారు.

'మన ఊరు - మన బడి'పై నీలినీడలు

- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేసిన సర్కారు
- బడుల అభివృద్ధి, మరమ్మతుల బాధ్యతలు ఈ కమిటీకే
- ఇటీవలే రూ.1100 కోట్లు కేటాయించిన సర్కారు
- జిల్లా మినరల్ ఫౌండేషన్‌ట్రస్టు, ఎస్‌డీఎఫ్ నుంచి నిధులు
- ఈ వేసవి సెలవుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): సర్కారు బడుల రూపురేఖలు మార్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'మన ఊరు - మన బడి' కార్యక్రమంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు కేసీఆర్ ప్రభుత్వం మూడు విడతల్లో ప్రణాళికలు రూపొందించింది. రాష్ట్రంలో 26,092 స్కూళ్లుండగా, మొదటి విడతలో 9,153 స్కూళ్లకు రూ. 3,497.62 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించారు. ఇందులో పనులు పూర్తయిన 1200 పాఠశాలలను నిరుడు ప్రారంభించారు. మరికొన్ని పాఠశాలల్లో పనులు కొనసాగుతుండగానే.. రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. కొత్త ప్రభుత్వంలో విద్యాశాఖను తన వద్దనే పెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల సచివాలయంలో ప్రభుత్వ పాఠశాలలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో 'మన ఊరు -మన బడి' కార్యక్రమం ఊసేత్తకుండానే సర్కారు బడుల మరమ్మతులు, పెండింగ్‌పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఇంత వరకూ బాగానే ఉన్నా... బడుల పర్యవేక్షణ బాధ్యతలను 'అమ్మ ఆదర్శ కమిటీలు' అంటూ మహిళా సంఘాలకు అప్పగించారు. ఈ మేరకు మార్చి 12న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేసింది. ఇందులో 10 అంశాలను ఎంపిక చేసి, ఆయా పనులను ఈ కమిటీల ద్వారానే చేపట్టాలని సూచించింది. స్కూళ్లల్లో మౌలిక వసతుల కల్పన, టాయిలెట్ల నిర్మాణం, తాగునీటి వసతి, విద్యుత్త